

## ఎంజీఎంలో చిమ్మ చీకట్లు..

కరెంట్ లేక ఆగిన పరీక్షలు

ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కున ఉన్న వరంగల్ ఎంజీఎంలో శనివారం ఉదయం నుంచి కరెంటు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ తో ముడివడిన ఎక్రేలు, స్కానింగ్ లు, బ్లడ్, యూరిన్ పరీక్షలు నిలిచిపోయాయి. పేషెంట్లు ఉక్కపోతతో చచ్చిపోయారు. దీంతో దాదాపు వైద్య సేవలన్నీ నిలిచిపోయినట్లయ్యాయి.


**- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ**


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 71 | శనివారం | 09 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

# అంతా ఉత్తుత్తదే..

వివరాలు 2లో..

## మొక్క నాటింది లేదు..పెంచింది లేదు



రెండేళ్లుగా ఇదే తంతు

అయినా మొక్కల పెంపక కేంద్రం అంటూ బిల్డప్

షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలపైనే ఖర్చు

బల్దియా తీరుకు ముక్కున వేలేసుకుంటున్న నగర ప్రజలు

వరంగల్ మహా నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారుల పనితీరు రోజు రోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా హరిత హారం కార్యక్రమం చేపడుతుంటే బల్దియా పాలకులు మాత్రం లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ మాయ చేస్తున్నారు. హరిత హారంతో 30శాతం అడవులు విస్తరించాయని ఒకవైపు రాష్ట్రం ప్రభుత్వం లెక్కలు చెబుతుండగా గ్రేటర్ వరంగల్ పరిధిలో మాత్రం ఇప్పటివరకు ఎన్ని మొక్కలు పెంచారు, ఎన్ని నాటారన్న లెక్కే దొరకడంలేదంటే ఇక్కడి సిబ్బంది పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. నగరం నడిబొడ్డున చార్ బౌళిలో ఒక్క మొక్క కూడా పెంచకపోయినా రెండేళ్లుగా మొక్కల పెంపక కేంద్రం అంటూ బోర్డుపెట్టి ప్రజలను పక్కదారి పట్టించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలిసిన వారు మాత్రం ఉత్తుత్తి మొక్కల పెంపక కేంద్రం అంటూ చలోక్తులు విసురుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



## చిరుధాన్యాలతో ప్రయోజనం

చిరుధాన్యాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని రోజు వారి ఆహారంలో చేర్చితే రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు అనేక ప్రయోజనాలు సమకూరుతాయని మిల్లెట్స్ ప్రమోటర్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. హనుమకొండ గోపాల్‌పూర్ లో శనివారం రికార్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మిల్లెట్స్ కుకింగ్ ఎక్స్ పర్ట్ కుసుమ కవిత ఊదల కిచిడి, ఊదల కరివేపాకు పులిహోర, మొక్కజొన్న పాయసం, సజ్జ పాయసం, కొర్ర పాయసం తదితర వంటకాలు తయారుచేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుసుమ సురేష్, జ్యోతి, పల్లవి, శృతి, రాధిక, భవాని తదితరులు పాల్గొన్నారు.

**- వరంగల్ వాయిస్, హనుమకొండ**



2లో

## మహా మనిషి కాళోజీ

ఘనంగా జయంతి వేడుకలు

నివాళులర్పించిన ప్రభుత్వ చీఫ్ విప్, కలెక్టర్లు



8లో

## కాషాయ జెండా ఎగరడం ఖాయం

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

పశ్చిమ టికెట్ కోరుతూ దరఖాస్తు



# అంతా ఉత్తుత్తదే..

## మొక్క నాటింది లేదు.. పెంచింది లేదు

### రెండేళ్లుగా ఇదే తంతు
### అయినా మొక్కల పెంపక కేంద్రం అంటూ బిల్డప్
### షెడ్డు నిర్మాణానికి రూ.2లక్షలపైనే ఖర్చు
### బల్దియా తీరుకు ముక్కున వేలేసుకుంటున్న నగర ప్రజలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక మొక్కల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంతరించిపోతున్న అడవులను కొంతైనా కాపాడుకోవాలన్న ఉద్దేశంతో హరిత హారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2015 జులై 3న చిలుకూరు బాలాజీ దేవాలయంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ భూభాగంలో 33శాతం మొక్కలు నాటి పచ్చదనం కనిపించాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ కార్యక్రమంలో 2016లోనే 46కోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడు కొనసాగిస్తున్నారు. అయితే అప్పటినుంచి ప్రతి ఏడు నగరంలో వివిధ నర్సరీల ద్వారా లక్షల మొక్కలు పెంచుతున్నాం..వాటిని నాటుతున్నామంటూ బల్దియా అధికారులు ప్రకటిస్తున్నారు.

**ఉత్తుత్తి కేంద్రమేనా..**

హరిత హారం కార్యక్రమం ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటి వరకు గ్రేటర్ వరంగల్ లో ఎన్ని మొక్కలు నాటారో లెక్క తేలడం లేదు. అయితే ప్రతి ఏడు లక్షల మొక్కలు నాటుతున్నట్లు గొప్పగా చెప్పుకుంటున్నా అందులో వాస్తవం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరుకే మొక్కల పెంపక కేంద్రం అంటూ బోర్డులు పెట్టి ప్రజలను తప్పుదారి పట్టించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరం నడిబొడ్డున చార్ బౌళీ వాటర్ ట్యాంక్ పరిధిలో ఇదే తరహాలో మొక్కల పెంపక కేంద్రం అంటూ బోర్డు పెట్టి రెండు సంవత్సరాలు కవాస్తున్నా ఇంత వరకు ఒక్క మొక్క కూడా పెంచింది లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెలియని వారు ఎవరైనా బోర్డు చూసి లోనికి ప్రవేశిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే.

**షెడ్డు వృథా..**

రెండు సంవత్సరాల క్రితమే మొక్కల పెంపక కేంద్రం అంటూ హడావిడి చేసిన బల్దియా పాలకవర్గం, అధికారులు ఇందుకోసం సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చుచేసి షెడ్డును నిర్మించారు. కొంత కాలంపాటు చూసేందుకు షెడ్డు కనిపించినా ఇప్పుడు అదికూడా పూర్తిగా ధ్వంసమైంది. విచ్చల విడిగా సంచరిస్తున్న కోతులు షెడ్డుకు అమర్చిన గ్రీన్ షేడ్ నెట్ ను పూర్తిగా చింపివేయడంతో షెడ్డు నామరూపాలే లేకుండా పోయింది. గ్రేటర్ అధికారులు మాత్రం ఉత్తుత్తి మొక్కల పెంపక కేంద్రాన్ని కూడా పరిగనలోకి తీసుకొని లక్షల మొక్కలు పెంచుతున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా బల్దియా పాలకవర్గం, అధికారులు ప్రజలకు జవాబుదారీ తనంగా వ్యవహరించాలని, లేనివి ఉన్నట్టు..ఉన్నవి లేనట్టు చూపిస్తూ మాయ చేయాల్సిన అవసరం లేదంటూ పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# 36వ డివిజన్‌లో మేరి మట్టి.. మేరి దేశ్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఆజాద్‌కా అమృత్ ఉత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 36వ డివిజన్ చింతల్‌లో ఆడెపు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడి పిలుపు మేరకు స్థానిక భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మేరి మట్టి.. మేరి దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుసుమ సతీష్, గంటా రవికుమార్, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ పవిత్ర ఆలయం నుంచి వేద బ్రాహ్మణులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మట్టి సేకరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అఖండ భారతదేశం పుణ్యభూమిగా పరిఢవిల్లాలని, ఈ దేశంపై పవిత్రమైన భక్తి కలుగాలని మోడి పిలుపు మేరకు ఈ దేశంలోని అన్ని గ్రామాలనుంచి మట్టి సేకరణ చేస్తుండంతో ఈరోజు ఈ ఆలయంలో స్థానిక ప్రజలందరి సహకారంతో ఈ మట్టిని సేకరించడం జరిగింది. ఈ మట్టి ఢిల్లీలో 75 మొక్కలతో అమృత వనంలో భాగస్వామ్యం అవుతుంది. దీంతో దేశ పర్యావరణ భాగంతో పాటు దేశ భక్తి ఔన్నత్యంలో భాగస్వాములు అవుతమాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం గౌరవ అధ్యక్షులు వీర ప్రతాప్, కనకుంట్ల రంజిత్, ఎరుకల రఘునా రెడ్డి, ముంద్రాతి వెంకటేశ్వర్లు, గోవింద్ సింగ్ అల్లి అజయ్, ఎరుకల ప్రసాద్ ఇనుముల అరుణ్, భైరి మురళీకృష్ణ, భైరి నాగరాజు, కంద్రాతి సీను, ఇనుముల రాజు, బంక రాజ్ కుమార్, రాజు, సిద్ధరాజు దుస శ్రీధర్, ముదిగొండ పాపయ్య, జోగు రాజేంద్రప్రసాద్, ఆకారపు శేఖర్, కొండ మహేష్, దేవాలయ అర్చకులు గురుసాయి,డింగరి వెంకట చారి, దేశభక్తులు, హిందుత్వవాదులు మరియు డివిజన్ ప్రజలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అట్టహాసంగా జి20 సదస్సు ప్రారంభం

## సదస్సును ప్రారంభించిన ప్రధాని మోడీ

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** భారత్ తొలిసారిగా అతిథ్యమిస్తున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు ఢిల్లీ వేదికగా శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రపంచ దేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తన ప్రసంగంతో మోడీ సదస్సును ప్రారంభించారు. మొరాకోలో సంభవించిన భూకంపంపై స్పందించారు. ప్రకృతి విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో మొరాకోకు భారత్ అండగా ఉంటుందని తెలిపారు. అంతకుముందు జీ-20 సదస్సు జరిగే భారత్ మండపం వద్ద.. ప్రపంచ నేతలకు ప్రధాని మోడీ స్వయంగా స్వాగతం పలికారు. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ-20 దేశాల కూటమిలో శాశ్వత సభ్యత్వం ఇచ్చినట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రకటించారు.




# మహా మనిషి కాళోజీ

### ఘనంగా జయంతి వేడుకలు
### నివాళులర్పించిన ప్రభుత్వ చీఫ్ విప్, కలెక్టర్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల మెదళ్లను సానబెట్టే అస్త్రంగా బాషను ప్రయోగించవచ్చని గుర్తించిన జనం కవి కాళోజీ నారాయణరావు. అందుకే ఆయన జయంతి సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవంగా గుర్తించారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి తెలంగాణ భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహిస్తున్నాం. తెలంగాణ మాండలికానికి నిలువెత్తు నిదర్శనం ప్రజాకవి కాళోజి నారాయణరావు అంటూ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కొనియాడారు. హనుమకొండలోని కాళోజి మార్గ్ సమీపంలోని ఆయన విగ్రహానికి వరంగల్, హనుమకొండ కలెక్టర్లు పి.ప్రావీణ్య, సిక్తా పట్నాయక్ లతో కలిసి దాస్యం వినయ్ భాస్కర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమానికి కాళోజి అక్షరాలు ఒక పదునైన ఆయుధంగా పనిచేసాయన్నారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంత దేశానిది ఇలాంటి మహా వ్యాఖ్యలు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనను కాంక్షించి అందుకోసం నిరంతరం పని చేసిన ప్రజా కవి అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి సందర్భంగా రాష్ట్ర భాష దినోత్సవంగా జరిపి ఆయన సేవలను స్మరించుకుంటుందన్నారు. కాళోజికి రాష్ట్రం ఏర్పాడ్డాక గొప్ప ఖ్యాతి లభించిందన్నారు. కాళోజీ ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అతి త్వరలోనే కాళోజి కళాక్షేత్రాన్ని సీఎం కేసీఆర్ లేదా మంత్రి కేటీఆర్ చేతుల మీద ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, సీపీ ఏవీ రంగనాథ్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కాళోజీ కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ పదిలం

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం పదిలంగా ఉంటదని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శనివారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ పరిధిలోని ధర్మారం గ్రామంలో వారు పర్యటించారు. పలు కాలనీలలో కాలినడకన తిరుగుతూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రూ.3 కోట్ల 83లక్షలతో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన 590 రైతులకు గాను రూ.50లక్షల విలువైన నష్టపరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం పదిలంగా ఉంటదని, అమలుకు నోచుకోని హామీలు కేసీఆర్ ఇవ్వరని, పేద ప్రజలకు అక్కరకొచ్చే పనులే చేస్తారని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్లు, 24 గంటల ఉచిత విద్యుత్తు, కుల వృత్తులకు ప్రోత్సాహం, సాగునీరు, సకాలంలో ఎరువులు ఇలా ఏ పథకాన్ని చూసినా కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ కన్నా గొప్పగా చేస్తామని మభ్యపెట్టే హామీలతో వస్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి ఎందుకు చేయలేదని, ఇప్పుడు చేస్తామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.200 పింఛన్‌ను రూ.2వేలకు పెంచింది కేసీఆర్ అని, కాంగ్రెస్ ఇప్పుడు రూ.4వేలు ఇస్తామంటే ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రూ.4వేల పింఛన్ ఇచ్చి ఇక్కడ ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. వ్యవసాయాన 3గంటల కరెంట్ చాలని రైతును మళ్లీ గోసపెట్టే కార్యక్రమానికి తెర లేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధిపై విషం చిమ్మే బీజేపీ నాయకులు..ముందుగా తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు ఎందుకు అమలు కావడం లేదో సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీల మోసపు మాటలు నమ్మి ప్రజలు ఆగం కావొద్దని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ సాధించిన నాయకుడు, ప్రజల కష్టాలు తెలిసిన నేత సీఎం కేసీఆర్ కావడం మనం చేసుకున్న అదృష్టమని అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, మరొక్కసారి దీవించి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుంకరి మనీషా శివకుమార్,ఆకులపల్లి మనోహర్, గద్దె బాబు, మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య, మండల రైతుబంధు కన్వీనర్ వీరాటి లింగారెడ్డి, సొసైటీ చైర్మన్లు దొంగల రమేష్, రడం శ్రీధర్, మాజీ జడ్పీ కోఆప్షన్ కొమ్ముల కిషోర్, నాయకులు గంగుల రమేష్, శ్రీనివాస్ రెడ్డి, పోగుల సంజీవ, మాజీ ఎంపీటీసీ పిట్టల రజిత రాజు, మాడిశెట్టి స్వరూప రాజయ్య, గాదె బాబు, నాసం మల్లేశం, బోల్లం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ల తీరు మారాలి



**వరంగల్ వాయిస్, బయ్యారం:** గార్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్స్‌కు సర్కిల్ ఇన్ స్పెక్టర్ పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ వారి జీవన విధానంతో పాటు, ప్రస్తుత వారి కుటుంబం స్థితిగతులను గురించి అడిగి తెలుసుకొని, గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. శాంతి భద్రతలకు, ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తూ వారిపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, తీరు మారకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, షీటర్లపై పీడీ యాక్ట్ పెట్టేందుకు సైతం వెనకాడమన్నారు. ప్రతి 6నెలలకు ఒకసారి చెడు ప్రవర్తన కలిగిన వారిని బైండోవర్ చేయడం వలన వారిపై పోలీస్ నిఘా ఉంటుందని, కాబట్టి వారి కదలికలు, ప్రవర్తన గురించిన విషయాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. బైండోవర్ కాలంలో ఏదైనా నేరానికి పాల్పడినట్లైతే జరిమానాతో పాటుగా జైలు శిక్ష కూడా విధిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టవిరుద్ధంగా పని చేసే వారి పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తామని, సమాజానికి హాని కలిగించే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చారించారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** జిల్లా పరిషత్ నిధుల నుంచి, 2022-2023 ఆర్థిక సంవత్సరం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల నుంచి రూ.18 లక్షలు జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళ పెల్లి శ్రీనివాస్ వివిధ గ్రామాల అభివృద్ధి పనులకు కేటాయించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనల మేరకు జిల్లా పరిషత్ నుండి స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నుంచి తొర్రూరు మండలానికి నిధులు విడుదల కాగా అందులో రూ.5లక్షలు వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మాణం చేసేందుకు కేటాయించామని తెలిపారు. రూ.13లక్షలతో మండలంలోని 10గ్రామాల్లో ఐమాస్ట్ జంక్షన్ లైటులను ఏర్పాటు చేసేందుకు కేటాయించినట్లు పేర్కొన్నారు. 1 .కర్కాల, 2.పెద్ద మంగ్యా తండా, 3.టిక్యా తండా, 4.అమర్ సింగ్ తండా, 5.చీకటాయపాలెం, 6.చింతలపల్లి, 7.కంటాయపాలం, 8.కొమ్మనపెల్లి, 9.గోపాల గిరి, 10.దుబ్బ తండా గ్రామాల్లో ప్రధాన కూడల్లో లైట్లు ఏర్పాటు పనులను పర్యవేక్షించి దగ్గరుండి పూర్తి చేయించారు. చింతలపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈనేపల్లి శ్రీను, పాక్స్ డైరెక్టర్ పాపిరెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన దొంతి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని తిమ్మరహేన్ పహాడ్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఎటూకురి బాలజోజి సోదరుడు ఏటుకూరి అర్లయ్య అనారోగ్యంతో శనివారం మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏఐసీసీ సభ్యుడు నర్సంపేట మాజీ శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి వారి స్వగృహానికి చేరుకొని మృతుడి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సర్పంచ్ సిద్దేన రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జయరాజ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, జారినీస్, పాపారావు, బుర్రి మోహన్, దాసరి కిషోర్, రషీద్, నిజాం, మంద విజయ్, నరేష్ పాల్గొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరం



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఆర్ టీసీ కల్యాణమండపం బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన మండలాల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గుడెప్పాడు ఎంపీటీసీ బీరం రజినీకార్ రెడ్డి, సంగెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, గీసుగొండ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, దామెర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## వ్యర్థ జలాలను దారి మళ్లించాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ మైన్ నుంచి వచ్చే వ్యర్థ జలాల వల్ల పంట పొలాలు నాశనం అవుతున్నాయని తాడిచెర్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండలంలోని తాడిచెర్ల ఊర చెరువు వద్ద గ్రామ రైతులు మాట్లాడుతూ మైన్ నుంచి వచ్చే వ్యర్థ జలాలు తాడిచెర్ల ఊర చెరువులో కలవడం వల్ల చెరువులో చాపలు చనిపోవడంతో పాటు చెరువు కింద వందల ఎకరాల్లో పంట పొలాలు కూడా నాశనం అవుతున్నాయని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, వెంటనే మైన్ అధికారులు స్పందించి వ్యర్థ జలాలు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఇప్పటికే రెండు సార్లు వరి నాటు పాడైపోయిందని, వరి నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందించడంతో పాటు వ్యర్థ జలాలు రాకుండా చర్యలు తీసుకోవాలని, లేకుంటే మైన్ పనులను అడ్డుకుంటామని గ్రామ రైతులు హెచ్చరించారు.

# ఏళ్లు గడుస్తున్నా కొలిక్కిరాని కాళోజి కళాక్షేత్రం పనులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా కవి కాళోజి పేరిట నిర్మిస్తున కాళోజి కళాక్షేత్రాన్ని గత తొమ్మిది ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశ పూర్వంగా నిర్లక్ష్యం చేస్తున్నదని యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ మండిపడ్డారు. శనివారం కాళోజి జయంతి సందర్భంగా కాళోజి కళాక్షేత్రానికి యూత్ కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ప్రజా కవి కాళోజి నారాయణ రావుకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు తోట పవన్ మాడ్లాడుతూ తెలంగాణకే తలమానికం అంటూ గొప్పలు చెప్పుకున్న కట్టడం కాళోజీ కళాక్షేత్రం అని 9ఏళ్ల నుంచి ఈ కళాక్షేత్రాన్ని నిర్మిస్తూనే ఉన్నారని అయినా ఇంకా పనులు పూర్తికాలేదని మండిపడ్డారు. మంత్రి కేటీఆర్ పర్యటన వరంగల్ లో ఉండడంతో స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తూతూ మంత్రంగా రూ.10లక్షలు వెచ్చించి మమ అనిపించారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్ ఎక్కడ ప్రభుత్వంపై అబాండం వస్తుందో అని భావించి , కళాక్షేత్రాన్ని సందర్శించకుండానే కార్యక్రమాన్ని వాయిదా వేశారని విమర్శించారు. ప్రోటోకాల్ ప్రకారం కళాక్షేత్రం ప్రారంభోత్సవం మంత్రి కేటీఆర్ శనివారం చేయాలని, అయితే ఎక్కడి పనులు అక్కడే ఉండడంతో ప్రారంభోత్సవం చేయలేకపోయారని విమర్శించారు. ఈ కాళోజి కళాక్షేత్రం పనులు అసంపూర్తిగా ఉన్నాయంటూ, పనులలో అవినీతి అక్రమాలు పెద్ద స్థాయిలో జరిగాయంటూ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట పవన్ ఆరోపించారు. కాళోజీ కల క్షేత్రం పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న పాలకుల వైఖరిని తోట పవన్ తీవ్రంగా ఖండించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ కట్టడం పూర్తయ్యే భాగ్యం ఉన్నదేమో అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కామ సంజయ్ పటేల్, సెహ్వాగ్, చందు, మురళి, భాను, గణేష్, రాకేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

## బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పీహెచ్ డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అరెస్టు చేసి టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచక్షణరహితంగా కొట్టడంతో గాయపడిన కేయూ విద్యార్థి నాయకులను పరామర్శించి, వారు చేస్తున్న నిరసన దీక్ష కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని మద్దతు తెలిపారు. ప్రశ్నిస్తే పోలీసులతో అరెస్టులు చేయించి విద్యార్థులను ఒక సంఘవిద్రోహ శక్తులుగా పోలీసులతో విచక్షరహితంగా, తీవ్రంగా గాయపరచడం ఏంటని ప్రశ్నించారు. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా అని అన్నారు. పోలీసులు ప్రజలకే జవాబుదారీగా ఉండాలని, అధికార పక్షానికి కాదని విమర్శించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేస్తారా? ప్రశ్నించే హక్కును హరించే హక్కు మీ పోలీసులకు ఎక్కడిది అని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు సైతం ఎదురెళ్లి తెలంగాణ సాధించుకున్న విద్యార్థుల శక్తి ముందు, పోలీసుల లాఠీలు, కేసీఆర్, కేటీఆర్ కుట్రలు పని చేయవని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో గాయపడిన విద్యార్థులు మాచర్ల రాంబాబు, ఆరేగంటి నాగరాజు, అంకిల్ల శంకర్ లను పరామర్శించారు. ఇంకా జైల్లోనే ఉన్న అంబాల కిరణ్, ప్రశాంత్ లను బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు.

# ట్రేడింగ్ కంపెనీని ప్రారంభించిన ఎమ్మెల్యే నరేందర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని 14వ డివిజన్ లో ఎస్ఆర్ నగర్ కట్ట మైసమ్మ గుడి దగ్గర శ్రీశైలం వీధిలో శ్రీరంగం కృష్ణ, రాము బ్రదర్స్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ భవాని ట్రేడింగ్ కంపెనీ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేందర్, 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, ఆర్టీఏ సభ్యులు గోరంట్ల మనోహర్, నాయకులు వేముల నాగరాజ్, పల్లకొండ ప్రభాకర్, కేతిరి రాజశేఖర్, బందారి శ్రీనివాస్, పద్మ గంగాధర్, గణిపాక సుధాకర్, సోను, చిలువేరు పవన్, ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# రహదారులకు గుంతలు.. నిర్లక్ష్యంగా అధికారులు



**వరంగల్ వాయిస్, కాటారం:** ఇసుక లారీలతో పాడైపోతున్న రోడ్లు, పట్టించుకోని తెలంగాణ ప్రభుత్వం. నియోజకవర్గ ఎమ్మెల్యే వైఖరి పట్ల ప్రజా సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. శనివారం కాటారం మండల కేంద్రం గారేపల్లిలో ప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు మాట్లాడుతూ కాళేశ్వరం టు హనుమకొండ. కాళేశ్వరం టు మంథని. వరకు ఇసుక లారీలు పోవడం వలన ఇరువైపుల మధ్యలో రోడ్డు ఎక్కడికి అక్కడికి పగిలిపోతుందని అన్నారు. ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వచ్చే బస్సులు కూడా రోడ్డు సరిగా లేకపోవడం వలన బస్సులు కూడా దిగబడి పోతున్నాయి. ఇసుక క్వారీ యాజమాన్యం తమ ఇష్టం వచ్చినట్లు దందా కొనసాగిస్తూ, రోజురోజుకు వందల లారీలు తిరగడం మూలంగా రోడ్డు పనికి రాకుండా పోతుంది. దీని విషయంలో పట్టించుకున్న నాథుడే లేదన్నారు. కనీసం తెలంగాణ ప్రభుత్వం నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా పట్టించుకోవడం లేదని, రోడ్డు మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టకపోవడం, ఇసుక క్వారీ దందాను అరికట్టలేకపోవడం వలన ఇష్టం వచ్చినట్లు రోడ్డు ధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇసుక దందాను అరికట్టి, రోడ్డు మరమ్మతులను చేపట్టి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంతెన రాజబాబు, జాడి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రేపు బీసీల సింహగర్జన

## వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్స్‌లో జరిగే బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రధాన పార్టీలు బీసీల పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాన్ని ఖండిస్తు రేపు హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చెయ్యడం జరిగిందని తెలిపారు. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు 60సీట్లు ఇవ్వాలని, బీసీని ముఖ్య మంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సభకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి అన్ని బీసీ కులాలకు చెందిన వారు, బీసీ సంఘాలకు చెందిన ప్రజలు, యువకులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలి వచ్చి బీసీల సత్తాను అన్ని రాజకీయ పార్టీలకు చూపించాలని కోరారు. రేపటి సభకు వచ్చే వారు ఉదయం 10గంటలకు హనుమకొండ నక్కలగుట్ట హరిత హోటల్ వద్దకు వస్తే అక్కడ నుంచి బస్సులు సమాకుర్చడం జరిగిందని తెలిపారు.

# పీఐబీ ప్రెస్ టూర్‌కు వరంగల్ జర్నలిస్ట్ రోజనాల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ లోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ప్రాంతీయ కార్యాలయం తలపెట్టిన ప్రెస్ టూర్ కు వరంగల్ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రోజనాల శ్రీనివాస్ వెళ్లనున్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఎనిమిది మంది జర్నలిస్టులను ఈ టూర్ కు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా జర్నలిస్టుల బృందం ముంబై, గోవాలో పర్యటించనుంది. ఈ నెల 10న ముంబైకి చేరుకోనున్న ఈ బృందం పీఐబీ కార్యాలయంతో పాటు మహారాష్ట్ర సచివాలయం, రాజ్ భవన్, సెంట్రల్ రైల్వే, కొంకణ్ రైల్వే కార్యాలయాలతో పాటు ఆర్బీఐ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ కార్యాలయాలను సందర్శిస్తారు. అనంతరం గోవాకు చేరుకోనున్న ఈ బృందం స్వయంపూర్ణ గోవా మిషన్ పథకాల పరిశీలన, డిజిటల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కున్బీ చీరల తయారీ కేంద్రం, పనాజీ వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రాజెక్ట్, రోడ్ల విస్తరణ కార్యక్రమాలను పరిశీలిస్తారు. ఈ టూర్ లో ఇద్దరు పీఐబీ అధికారులు ఉండగా సీనియర్ జర్నలిస్టులు ఎఫ్ ఎం సలీమ్(హిందీ మిలాప్), సుధీర్ (నవ తెలంగాణ), దేవేందర్ (సాక్షి), జి.వెంకటేష్ (ఆంధ్రజ్యోతి), డాక్టర్ కె వెంకటేశ్వర్లు (ది పయనీర్), సూర్యకిరణ్ (నమస్తే తెలంగాణ), ప్రవీణ్ కుమార్ (హిందుస్తాన్ టైమ్స్ తెలుగు) ఉన్నారు. ఈ నెల 17తో ప్రెస్ టూర్ ముగియనుంది. ఈ టూర్ లో భాగంగా పలు సెమినార్లు ఉండనున్నాయి. ప్రెస్ టూర్ కు వెళ్లనున్న రోజనాల శ్రీనివాస్ కు చిన్న, మధ్య తరహా పత్రికల జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

# భూపాలపల్లి బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

## బీసీ నాయకుడు సుంకరి మనోహర్



**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి నియోజకవర్గ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి మనోహర్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులోని నాంపల్లి రాష్ట్ర కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బీసీ నాయకుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి సుంకరి మనోహర్ శనివారం దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా సుంకరి మనోహర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా బీసీల ఓట్లు ఉన్నందున కచ్చితంగా ఈసారి బీసీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర పార్టీ నాయకత్వాన్ని అభ్యర్థించడం జరిగింది. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్న బీజేపీ నాయకత్వం కచ్చితంగా బీసీలకు ఈసారి జరగబోయే శాసనసభ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు.

# ఘనంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ మున్సిపల్ సానిటేషన్ మహిళా సిబ్బంది సుమారు 60మందికి ఎమ్మెల్సీ రవీందర్ రావు సతీమణి సంధ్యా రాణి చేతుల మీదుగా మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యం లో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, టీఆర్ఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో విజృంభిస్తున్న విషజ్వరాలు

## పట్టించుకోని అధికారులు



**వరంగల్ వాయిస్, ములుగు :** కన్నాయిగూడెం మండలంలోని గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులు సక్రమంగా చేయకపోవడం వల్ల ఇంటికి ఒకరు ఇద్దరు చొప్పున విషజ్వరాలు, డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చి ప్రైవేటు ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారని వైఎస్సార్? టీపీ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు కల్వచర్ల భిక్షపతి అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు కొరవడి అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో దోమల మందు పిచికారి చేయాల్సి ఉన్నా చేయడం లేదని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలను పట్టించుకునేవారు లేరా.? గ్రామపంచాయతీ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ వారు ఫాగింగ్?, కాలువల్లో బ్లీచింగ్? వేయించి, ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలని కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు కల్వచర్ల భిక్షపతి డిమాండ్ చేశారు.

## ప్రజాకవి కాళోజి నారాయణ రావు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజల గోడవను తన గొడవగా భవిస్తూ అనేక కవితలు, సాహిత్యాన్ని రచించి తెలుగు ప్రజలను చైతన్యం చేయడంతో పాటు తెలుగు ప్రజల చేత ప్రజాకవిగా పేరు తెచ్చుకున్న గొప్ప కవి కాళోజి నారాయణ రావు అని, వారు రచించిన కవితలు మనకు ఎంతో స్ఫూర్తి దాయకమని జిల్లా ఎస్పీ జి.చంద్ర మోహన్ అన్నారు. ప్రజాకవి శ్రీ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కవులలో కాళోజీ ప్రముఖులు తన కవితలతో తెలంగాణ ప్రజలను ప్రభావితం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎంతో కృషి చేశారని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోను, రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలోను పాల్గొని తన కవితలతో ప్రజలను చైతన్యం చేశారని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ బంగారు తెలంగాణ కోసం శ్రమించాలని, భవిష్యత్ తరాలకోసం అనునిత్యం కష్టపడాలని, భావి తరాల కోసం బంగారు బాట వేయాలని పోలీస్ శాఖ సిబ్బందికి జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ బీ ఇన్ స్పెక్టర్ రమాకాంత్, డీసీఆర్ బీ సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు భాస్కర్, అనిల్, సొమ్మల్లు, ఆర్ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధిక్కార స్వరం కాళోజి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పలు బాషా కోవిధిడు, పద్మభూషణ్ కాళోజి నారాయణ రావు ధిక్కార స్వరం నేటి యువతకు స్ఫూర్తి కావాలని న్యూ లయోల విద్యా సంస్థల అధిపతి తాటిశెట్టి క్రాంతి కుమార్ అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కుమార్ పల్లిలోని న్యూ లయోలా హై స్కూల్ లో నిర్వహించిన కాళోజి నారాయణరావు 109వ జయంతి, తెలంగాణ భాష దినోత్సవంలో తాటిశెట్టి క్రాంతి కుమార్ పాల్గొని అయన చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాళోజి నారాయణరావు విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర పోరాటంలో పాల్గొని ఎన్నో సార్లు జైలుకు వెళ్లారని చెప్పారు. తెలుగు ఉర్దూ, మరాఠీ, హిందీ భాషల్లో ప్రావీణ్యం కలిగిన వారు అన్ని భాషలలో ఎన్నో కవిత్వాలు రాసి ప్రజలనూ చైతన్యం చేశారని ఆయన సేవలకు గాను భారత ప్రభుత్వం పద్మభూషణ్ తో సత్కరించారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన పుట్టిన రోజు తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుతుందని, తెలంగాణ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టడం గొప్ప విషయమని అన్నారు. హనుమకొండ కేంద్రంగా కాళోజి కళ క్షేత్రం , కాళోజి హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి వారిని గౌరవించింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, నాగలక్ష్మి, అమీన్, గౌసియా,స్వప్న , ప్రసన్న , స్వప్న రాణి,నవ్య, శిరీష, బుచ్చిబాబు, చంద్రశేఖర్, విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కాళోజి అందరికీ స్ఫూర్తి..



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు అందరికీ స్ఫూర్తి అని బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్.మడికొండ శ్రీను అన్నారు. శనివారం పట్టణంలోని అమరధామంలో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ అధ్వర్యంలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీ తన రచనలతో తెలంగాణ ఖ్యాతిని పెంచారని అన్నారు. పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని నినదించిన కాళోజీ జీవితం అంతా తెలంగాణ భాషా సాహితీ సేవ దిశగా సాగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరకాల మునిసిపల్ వైస్-చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, పరకాల మునిసిపల్ కౌన్సిలర్స్ పసుల లావణ్య రమేష్, బండి రాణి సదానందం గౌడ్, ఏకు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు శనిగరపు శ్రీనివాస్, బొచ్చు జేపీ, ఏకు ఈశ్వర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బండి రమేశ్ గౌడ్, వార్డు కమిటీ అధ్యక్షుడు బొట్ల నరేష్, బొచ్చు శ్రీనివాస్, నాయకులు బొచ్చు భాస్కర్, బొచ్చు రమేశ్, బొచ్చు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళోజి స్ఫూర్తితోనే తెలంగాణ సాధన

### కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్



**వరంగల్ వాయిస్, మడికొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ పరిధిలోని మడికొండలో పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సమస్యలు, అన్యాయాలను తట్టుకోలేక ప్రజల కోసం తన గొడవను కవిత్వం ద్వారా సున్నితంగా ఆవిష్కరించిన కాళోజి స్ఫూర్తి తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రగతిలో ఇమిడి ఉన్నదన్నారు. ఈ సంవత్సరం కాళోజి పురస్కారాన్ని అందుకోనున్న ప్రముఖకవి జయరాజ్ కు కార్పొరేటర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బోల్లికొండ వినోద్ కుమార్, రాష్ట్ర హౌస్ ఫెడ్ డైరెక్టర్ తక్కలపల్లి రాంగోపాల్ రావు, పట్టణ శాఖ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ నర్మేట భిక్షపతి గాండ్ల, 46వ డివిజన్ నాయకులు కొలిపాక కుమార్ బాబు, బరిగల కృష్ణమూర్తి, పల్లపు కుమార్ రాజ్, తూర్పాటి అబ్బ సాయిలు, గోపనబొయిన రాజు, రాసమల్ల వెంకటస్వామి, వస్కుల దేవేందర్, రాసమల్ల రాజు, గంగారపు వీరెష్ కాలేశ్వరంపు రాజేందర్, వస్కుల వీరస్వామి, డిష్ ప్రభాకర్, పల్లపు రాజకుమార్, ఆరూరి తిరుపతి, వస్కుల నర్సింగ్, నర్రా రమేష్, నమిండ్ల స్వామి, కడమంచి మహేందర్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మిక సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, సహాయ కార్యదర్శి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు తెలిపారు. శనివారం మడికొండ రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో మడికొండ గౌడ సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీలో మండల గౌరవ అధ్యక్షుడిగా కుర్ర రవి గౌడ్(సోమిడి), మండల గౌరవ సలహాదారుడిగా మడికొండ గౌడ సొసైటి అధ్యక్షుడు బుర్ర రాజ్ కుమార్ గౌడ్ (మడికొండ), మండల అధ్యక్షుడిగా మోడెం రాజేందర్ గౌడ్ (మడికొండ), కార్యదర్శిగా రాంపూర్ సొసైటీ అధ్యక్షుడు వీరాంజనేయులు గౌడ్, ఉపాధ్యక్షులుగా బండి రంజిత్ కుమార్ గౌడ్ (రాంపూర్), బండి సురేష్ గౌడ్ (టేకులగూడెం), గంగాపురం వేణు గౌడ్ (తరాల పల్లి)లను, సహాయక కార్యదర్శులుగా సట్ల నర్సింగ్ గౌడ్ (మడికొండ), నర్మెట సుధాకర్ (కడిపికొండ), బండి చరణ్ గౌడ్ (టేకులగూడెం), కార్యవర్గ సభ్యులుగా బండి రాజు, నాగపూరి బ్రహ్మా, బండి రాజేష్, మడ్డి రాజారాం, సోషల్ మీడియా ఇన్చార్జిలుగా గడ్డం రవీందర్ గౌడ్, బుర్ర సతీష్ గౌడ్, మాచర్ల క్రాంతి కుమార్ గౌడ్ లను ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు మాచర్ల సదానందం, మడికొండ, రాంపూర్, తరాలపల్లి, సోమిడి గౌడసంఘం డైరెక్టర్లు, సభ్యులు, గీత కార్మికులు పాల్గొని నూతన కార్యవర్గానికి అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## డీపీఎస్‌లో కాళోజి జయంతి ఉత్సవాలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెద్ద పెండ్యాల్ లోని డీపీఎస్ వరంగల్ స్కూల్ లో కాళోజి నారాయణ జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. 2014వ సంవత్సరం నుంచి కాళోజి జయంతిని (సెప్టెంబర్ 9) తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని పాఠశాల చైర్మన్ రవికిరణ్ రెడ్డి అన్నారు. తెలుగు భాష మాధుర్యాన్ని,తెలంగాణ భాష సౌందర్యాన్ని భాష పై తనకున్న అభిరుచిని విద్యార్థులతో పంచుకున్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో, ప్రసిద్ధ తెలంగాణ కవుల, రచయితల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ రాకేశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుమోల్ శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పెద్దవంగర మండలం మోత్యా తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా యాకన్న, భూక్యా ప్రవీణ్, భూక్యా నరేష్, గుగులోత్ నరేష్, గుగులోత్ నవీన్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు బీఆర్ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు.

## పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వండి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం ఆ పార్టీ మాజీ కార్పొరేటర్ రామలింగం శనివారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన తన అనుచరులతో కలిసి హైదరాబాదులోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో తన దరఖాస్తును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా నార్ల రామలింగం మాట్లాడుతూ కాజీపేట ప్రాంతానికి చెందిన తాను గతంలో అనేక స్థానిక సమస్యలపై పోరాడానని, ఈసారి తనకు వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఆయన పార్టీ నేతలకు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివకుమార్, సదానందం, స్వామి, కుమారస్వామి, చంటి, గఫూర్, తదితరులు పాల్గొన్నారు

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి**

**మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి**

**ఎమ్మెల్యే అరూరి రమేష్**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండలం అన్నారం, కల్లెడ గ్రామాల మహిళా సంఘాల వార్షిక మహాసభకు ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి అని కొనియాడారు. మహిళా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. బీఆర్ఎస్ పరిపాలనలోనే రాష్ట్రంలోని మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న వీవోఏల గౌరవ వేతనాలను పెంచి మహిళల పట్ల తన అభిమానాన్ని కేసీఆర్ చాటుకున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదని, మహిళలు ఆత్మగౌరవంతో బతికే విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్‌కి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ 21వ డివిజన్ లో నిర్వహించిన బీజేపీ ఇంటింటి ప్రచారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. అలాగే చిరు వ్యాపారులను, ఉద్యోగులను కలిసి, వారికి కేంద్రం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు వివరించారు. దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, కోమాకుల నాగరాజు, మస్నా దిలీప్, కందుకూరి శ్రీనివాస్, ముల్క అమర్, కొత్తకొండ సతీష్, యాదగిరి, వంగరి ప్రదీప్, వెయ్యికళ్ల శ్రీనివాస్, అపురూప సాయి, ధర్మపురి రామారావు, సాంబశివుడు, కోట సతీష్, రత్నం కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ అసెంబ్లీ అభ్యర్థిగా తీగల భరత్ గౌడ్ దరఖాస్తు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హుస్నాబాద్ అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే టికెట్ కోసం బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గౌడ్ దరఖాస్తు చేశారు. అసెంబ్లీ పరిధిలోని అన్ని మండలాల సహకారంతో బీసీ సామాజిక వర్గం నుంచి తీగల భరత్ గౌడ్ హుస్నాబాద్ అసెంబ్లీ స్థానానికి రావు పద్మ ఆశీస్సులతో బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శనివారం దరఖాస్తును దాఖలు చేయడం జరిగింది. ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన తీగల భరత్ గౌడ్ విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో క్రీయాశీలకంగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేయడంతో పాటు 2013లో బీసీ రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 2015లో తెలంగాణ గౌడ సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికై గౌడ్ ల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేశారు. పలు విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నారు. ప్రస్తుతం బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పీ జయంతి లాల్, దేశిని సదానందం గౌడ్, అన్ని మండలాల అధ్యక్షులు తీగల భరత్ గౌడ్ కు మద్దతు తెలిపారు.

## పుట్ట మధుకర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ను బీఆర్ఎస్ మండల మహిళా నాయకులు బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజక వర్గం మహిళ అధ్యక్షురాలు కేదారి గీత బాయి, మహాదేవపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఓడెటి స్వప్న మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, ముందస్తు శుభాకాక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, మహదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పెండ్యాల మమత మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్, యూత్ అధ్యక్షుడు అలీం ఖాన్, సీనియర్ నాయకులు అన్కరి ప్రకాష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చని ఎమ్మెల్యే చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక బీజేపీ రూరల్ కార్యాలయంలో రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, గుజ్జ సత్యనారాయణ రావు, కాచం గురుప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ చందర్ రెడ్డి, సంతోష్ కుమార్ లు మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచారని అన్నారు. హామీలు నెరవేర్చకుండా ఏవిధంగా ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రశ్నించారు. గెలిచిన వెంటనే నిరుద్యోగులకు రూ.3016 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి లాంటి సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే అనుచరులకే ఇస్తున్నాడని నిజమైన లబ్ధిదాలకు ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలను తెలంగాణ సంక్షేమ పథకాలకు మళ్లించాడని కేంద్ర ప్రభుత్వం బొమ్మ పెట్టకుండా మొత్తం తానే చేశాడని కేసీఆర్ చేయడం విడ్డూరమని అన్నారు. పరకాల నియోజకవర్గం, తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, బీజేపీ ప్రభుత్వం వస్తే ప్రజలకు సంక్షేమ పథకాలు అంది ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల ప్రధాన కార్యదర్శి జంగిలి రాజేందర్ రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి, పరకాల రూరల్ మండల ఇంచార్జి ఎర్రం రామన్న, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కొమ్మిడి మహేందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు దయ్యాల దేవరాజు, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కట్టగాని శ్రీకాంత్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వీరస్వామి గౌడ్, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ కాసగాని రాజకుమార్ , బీజేవైఎం మండల అధ్యక్షుడు కాసగాని సాయికుమార్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై ప్రభుత్వానిది సవతి తల్లి ప్రేమ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర సాధనలో అత్యంత కీలకపాత్ర పోషించిన ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, లేనిపక్షంలో ఈనెల 12న డీహెచ్ఎంఓ కార్యాలయం ముందు మహా ధర్నాను నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నరపు రమేష్ తెలిపారు. ఉద్యోగులపై సవితి తల్లి ప్రేమ సరికాదన్నారు, కేసీఆర్ ఎన్నికల్లో చెప్పినట్టు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఎలాంటి షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు పోచమ్మ మైదాన్ లో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి దశాబ్ద కాలం పూర్తవుతున్నా ఒక్క ఉద్యోగిని కూడా పర్మినెంట్ చేయలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్టు ఎన్.హెచ్.ఎం. స్కీం లో పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామర కృష్ , జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్, జిల్లా ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు బోళ్ల వసంత, కుంట శాంతి, ఎన్. హెచ్ఎం రాష్ట్ర నాయకులు సరిత, జిల్లా నాయకులు మార్క రాజేష్ గౌడ్, బి.అనూష, ఉష ప్రియా, సుమ, దిలీప్ కుమార్, ప్రేమలత, కుమార్ సరస్వతి, జ్యోతి, హారిక చైతన్య, అనిల్, విజేత, అరుణ, లావణ్య, ఓ.సందీప్ కుమార్, రమాదేవి, మానస, రాజేష్, కళ్యాణి, రమేష్ సరోజ, విజయ్ నాయక్ రాకేష్, సుజాత, రజిత, బి.జ్యోతి, సింధూజ కళ్యాణి, సుష్మ, రాకేష్, బైరి అశోక్, చైతన్య, చిరంజీవి, పీ.శ్రీధర్, ఎం.అనూష, మౌనిక, ఎం.శ్రీనివాస్ బాబు, నూకల అంజయ్య, కుమార్, సతీష్ కుమార్, అభిషేక్, డి.మాధవ్ రావు, శ్రీనివాస్, బండి రాజేష్, లావణ్య, జ్యోష్న, శైలజ, మంజుల, సుజాత, శోభారాణి, రజియా, స్వప్న, కృష్ణవేణి, వెంకటేష్, విజయతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాచెర్ల కుమారస్వామి గౌడ్ దరఖాస్తు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హుస్నాబాద్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిత్వం కోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మురళీధర్ గౌడ్ కు మాచర్ల కుమారస్వామి గౌడ్ దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేశిని సదానందం గౌడ్, జయంతి లాల్, కొండి జితేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రాతి శ్రీనివాస్, భీమదేవరపలి మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ గౌడ్, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్, మధుకర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



## హరిహర వీరమల్లులో కీలక ఘట్టాలు

పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు' క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో మెగా సూర్య మూవీస్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం కోసం పవన్ యుద్ధ విద్యల కోసం 'షావోలిన్ వారియర్ మంక్ అకాడమీ'లో పవన్ శిక్షణ తీసుకున్నారు. ఆయనకు శిక్షణ ఇచ్చిన ట్రైనర్ హర్ష్ వర్మ కూడా ఈ చిత్రం సందడి చేయనున్నారు. ఈ విషయంపై తాజాగా ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ వల్లే నాకు నటనపై ఆసక్తి కలిగింది. పవన్‌తో కలిసి పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తాను. సెట్‌లో ఎంతో ప్రశాంతంగా ఉండే ఆయన్ను చూసి ఆశ్చర్యపోయాను. చిన్న విషయాన్ని కూడా నిశితంగా ఆలోచిస్తారు. ప్రతి విషయంలోనూ స్పష్టత ఉంటుంది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం. క్షణాల్లో సీన్ మార్చినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారు. శిక్షణ ఇచ్చే సమయంలో నాకూ నటనపై ఆసక్తి ఉందని వెల్లడించాను. అంతే లుక్ టెస్ట్ చేయించారు. టెస్ట్ ఓకే అయింది. యాక్టింగ్ చేయాలనే కోరిక నాలో పుట్టడానికి కారణం ఆయనే. 'హరిహర వీరమల్లు' క్లైమాక్స్ ఇంకా చిత్రీకరించాల్సి ఉంది. ప్రస్తుతం దీనితోపాటు బాలీవుడ్ సినిమాల్లోనూ నటిస్తున్నాను' అని అన్నారు. టీవల జరిగిన ఓ కార్యక్రమంలో చిత్ర నిర్మాత ఎ.ఎంరత్నం సినిమా షూటింగ్ గురించి క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది చివరికి సినిమా పూర్తవుతుందని , వచ్చే ఎన్నికల కంటే ముందే చిత్రాన్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ చిత్రంలో పవన్ సరసన నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు.

## క్లాప్ కొట్టిన దర్శకేంద్రుడు

మ్యాచో స్టార్ గోపిచంద్ హిట్టు చూసి చాలా ఏళ్లయింది. దాదాపుగా తొమ్మిదేళ్లుగా సరైన హిట్టు లేక సతమతమవుతున్నాడు. ఎన్నో ఆశలు పెట్టుకున్న రామబాణం అల్టా డిజాస్టర్‌గా నిలిచింది. తన కెరీర్‌లో రెండు బిగ్గెస్ట్ హిట్లిచ్చిన శ్రీవాస్ సైతం ఈ సారి గోపిను కాపాడలేకపోయాడు.





దాంతో కొంత గ్యాప్ తీసుకుని గోపిచంద్ తన కొత్త సినిమాను ప్రారంభించాడు. అది కూడా ఐదేళ్లుగా మెగాఫోన్ పట్టిన శ్రీనువైట్లతో. ఒకప్పుడు సూపర్ ఫామ్‌లో ఉన్న వైట్ల ఇప్పుడు హిట్టు సినిమా తీయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. పిలిచి మరీ ఆఫర్ ఇచ్చిన రవితేజకు అమర్ అక్బర్ ఆంటోని రూపంలో డిజాస్టర్ సినిమా ఇచ్చాడు. ఆ తర్వాత ఇప్పటివరకు శ్రీనువైట్ల మరో సినిమా చేయలేదు. అయితే చాలా మంది ఈ దర్శకుడి సినిమాలను విపరీతంగా ఇష్టపడుతుంటారు. ఇప్పుడంటే టైమ్ బాలేక సరైన సినిమాలు పడట్లేదు కానీ.. దూకుడు వరకు ఆయన సినిమాలు జనాలకు ఓ ఎంటర్‌టైనమెంట్ ఫార్ములా. కేవలం పోస్టర్ పైన ఆయన పేరు కనిపిస్తే అప్పట్లో థియేటర్‌లకు పరిగెత్తిన జనాలు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అలాంటి డైరెక్టర్ ఇప్పుడు పతాళంలోకి పడిపోయాడు. ఆ మధ్యన ఢీ సీక్వెల్ అంటూ ప్రకటించినా.. అది కార్య రూపం దాల్చలేదు. ఇక ఎట్టకేలకు మ్యాచో స్టార్‌ను ఒప్పించి ఓ ఫ్యామిలీ కథను చేయబోతున్నాడు.కేవి గుహన్, గోపి మోహన్ వంటి స్టార్ టెక్నిషియనలు ఈ సినిమాకు పని చేస్తున్నారు. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకుంది. ఈ వేడుకకు దర్శకేంద్రడు రాఘవేంద్రరావుతో పాటు మైత్రీ నిర్మాత నవీన్ ఎర్నేని గెస్టలుగా వచ్చారు. ఈ సినిమాకు చైతన్య భరద్వాజ్ సంగీతం అందిస్తున్నాడు.



## ఆదికేశ నుంచి సిత్తరాల సిత్రావతి పాట విడుదల

వైష్ణవ్ తేజ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఆదికేశవ' శ్రీలీల కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రంతో అపర్ణా దాస్, జోజు జార్జ్ తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంతో శ్రీకాంత్ ఎన్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవు తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి 'సిత్తరాల సిత్రావతి' అంటూ సాగే పాటను శనివారం చిత్ర బృందం విడుదల చేసింది. హీరోహీరోయిన్ల మధ్య సాగే మెలోడీ సాంగ్ ఇది. హీరో హీరోయిన్‌ను 'సిత్తరాల సిత్రావతి' అని పిలుస్తూ, ఆమె అందాన్ని పొగుడుతూ పాడే పాట ఇది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. రాహుల్ సిప్లిగంజ్, గాయని రమ్య బెహరా ఆలపించారు. పార్టీల్లో ఈ పాట మార్మోగనుందని చిత్ర బృందం చెబుతోంది. పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటర్‌గా, డడ్లీ, ఆర్థర్ ఎ. విల్సన్ సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తున్నారు.





# ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు రండి

## సీపీ రంగనాథ్ ను ఆహ్వానించిన చాంబర్ ఆఫ్ కామర్స్ సెలబ్రేషన్స్ లోగో ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ 75 వసంతాల ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ కు హాజరు కావాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ను చాంబర్ కమిటీ ఆహ్వానించింది. శనివారం చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను సీపీ ఆవిష్కరించారు. ఈనెల 15న శోభాయాత్రతో ప్రారంభమయ్యే వేడుకలు పదిహేను రోజులపాటు వివిధ కార్యక్రమాలతో అలరించనున్నట్లు ప్రకటించారు. 20నుంచి 26వ తేదీ వరకు వివిధ క్రీడా పోటీలు, శాస్త్రీయ సంగీతం, దేశభక్తి పాటల పోటీలు, కూచిపూడి, భరతనాట్య పోటీలతో పాటు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న వజ్రోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం, అక్టోబర్ 1న వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 15 రోజుల పాటు చాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సీపీని కోరారు. చాంబర్ ఆహ్వానంపై స్పందించిన పోలీస్ కమిషనర్ ప్లాటినం జూబ్లీ వేడుకలు విజయవంత మవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ గౌరవ ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాష్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లే సంపత్, కో ఆప్షన్ సభ్యులు రాయిశెట్టి సత్యనారాయణ, చిల్లీస్ సెక్షన్ అధ్యక్షుడు రాజేష్ డి.కరాణి, అడితి సెక్షన్ ఉపాధ్యక్షుడు సూర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాషాయ జెండా ఎగరడం ఖాయం

## బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పశ్చిమ టికెట్ కోరుతూ దరఖాస్తు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణలో త్వరలో జరుగనున్న శాసన సభ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురడం ఖాయమని భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ భరోసా వ్యక్తం చేశారు. శనివారం ఉదయం నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ కాన్వాయ్ తో ర్యాలీగా హైదరాబాద్ తరలి వెళ్లారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలతో కలిసి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్న ఆమె వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. 'నిజాయితీ మా మార్గం – అభివృద్దే మా లక్ష్యం' అంటూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ పై ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. జిల్లాలో బీజేపీని సంస్థాగతంగా ప్రతిష్టపరిచి ఒక బలమైన శక్తిగా, అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా తయారు చేశామన్నారు. పార్టీ నేతల సహకారంతో సమష్టిగా పనిచేసి గత కార్పొరేషన్ ఎన్నికలలో 10 కార్పొరేటర్ స్థానాలను గెలుచుకున్నామన్నారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలతో పాటుగా, ప్రజా సమస్యలపై నిత్యం ప్రజల పక్షాన నిలిచి ఎన్నో పోరాటాలు చేశామని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో స్వయంగా పాల్గొని ఢిల్లీలో ఆనాడు రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో కూడా పాల్గొనడం జరిగిందన్నారు. పార్టీ తప్పకుండా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరబొయిన సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేశిని సదానందం గౌడ్, కొలను సంతోష్ రెడ్డి, అర్.పి. జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారయణ, జిల్లా పదాదికరులు గంద్రతి శ్రీనివాస్, పాషికంటి రాజేంద్ర ప్రసాద్, చిర్ర నర్సింగ్ గౌడ్, శ్రీరాం రెడ్డి, నవనగిరి నిర్మల, మాచర్ల కుమారస్వామి, గుజ్జుల మహేందర్ రెడ్డి, తోపుచర్ల అర్చన మధు సూధన్, తీగల భరత్ గౌడ్, జన్ను మధు, మాలోతు నాను నాయక్, గుండెకారి కోటేశ్వర, మహేష్ గౌడ్, ఎండి చాంద్ పాషా, తుమ్మ శోభన్, మట్ట రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

### వర్ధన్నపేటకు మార్టిన్ లూథర్ దరఖాస్తు..



వర్ధన్నపేట అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాల్సిందిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పోలేపాక మార్టిన్ లూథర్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాల రాజేందర్, 18వ డివిజన్ అధ్యక్షులు బొడ్డు రాకేష్, 19వ డివిజన్ అధ్యక్షుడు పులి చేరి ఉపేందర్, 20 వ డివిజన్ అధ్యక్షుడు సుతారీ గోపి, ఎస్సీ మోర్చా నాయకులు జన్ను మధు, చిలక విజయరావు, సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ట్రస్మా నూతన కమిటీని గుర్తించిన రాష్ట్ర కమిటీ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఇటీవల నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రికగ్నైజడ్ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్ (ట్రస్మా) వరంగల్ జిల్లా కమిటీని అధికారికంగా రాష్ట్ర కమిటీ గుర్తించింది. ట్రస్మా వరంగల్ జిల్లా కమిటీకి నూతన అధ్యక్షులుగా అంకతి వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా బిల్లా రవి, కోశాధికారిగా ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, గౌరవాధ్యక్షులుగా ఆడెపు శ్యామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అక్కినపల్లి సతీష్ కుమార్, సలహాదారులుగా కోడం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, ముఖ్య సలహాదారులుగా ఎన్.వెంకటేశ్వరరావుతో కూడిన కమిటీని అధికారికంగా గుర్తించినట్లు రాష్ట్ర ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి ఐవీ.రమణారావు ఒక పత్రిక ప్రకటనకు లేఖ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రస్మా వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ లో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా చర్చించారు. ఇటీవల జరిగిన గురుపూజోత్సవ సందర్భంగా ట్రస్మా వరంగల్ జిల్లా నుంచి మొత్తం 14 మందికి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించినందుకు వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగపురి కిరణ్, దాసి సతీష్ మూర్తి, కూరపాటి మోహన్, కూచన క్రాంతి కుమార్, ముల్క శరత్ బాబు, బండి చక్రపాణి పాల్గొన్నారు.

# కాళోజీ విగ్రహం ఏర్పాటు చేస్తా: నన్నపునేని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రజాకవి పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. కాళోజీ 109వ జయంతి సందర్భంగా ఆల్ బ్రహ్మిన్ ఆఫీషల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అబోపా), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో పోచంమైదాన్ లోని రత్న హోటల్ ఎదురుగానున్న కెమిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాళోజీ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. తన కవిత్వాలతో ఆంధ్ర పాలకులపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించి చురుకులంటించే వారన్నారు. ఆయన కవితులు ఎందరినో ప్రేరేపించి ఉద్యమ బాట పట్టించాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ ఓ వెంకటరమణ, స్టేట్ జనరల్ సెక్రటరీ బండ్ల మోహన్ రావు, ఐఎంఏ ప్రెసిడెంట్ రాకేష్, బీఆర్ఎస్ నాయకులు వద్దిరాజు గణేష్, వద్దిరాజు వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ బస్వరాజు కుమార్, పీఏసిఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ, నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, అజిత్ మహమ్మద్, సంత్, రామచందర్, నరేష్, డాక్టర్లు సంధ్యారాణి, కీర్తి, సునీత్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కంచర్ల శివ, బొల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా..



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. వరంగల్ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ 41వ వార్షికోత్సవాన్ని శనివారం శంబునిపేటలోని ఆర్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ డీటీవో భవనం హనుమకొండలో ఉన్నందున ఎదురవుతున్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మస్వామి గౌడ్, పెన్షనర్స్ అధ్యక్షులు ఐలసాగరం రామనాధం, జిల్లా అధ్యక్షులు ఉప్పులయ్య, జన్ను జకరియా, పులి సారంగం, శోభన్, డివిజన్ అధ్యక్షులు ఈదుల రమేష్, కలకోట రమేష్, బజ్జూరి రవి, ఈదుల భిక్షపతి, పగిడిపల్లి పద్మ, ఎండి సలావుద్దిన్, చలమల్ల సత్యనారాయణ, వడ్లకొండ జగన్నాధం, కోట యాదగిరి, ఎండి అహ్మద్ ఖాన్, నియోజకవర్గ రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com